
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
ఆదివారం 31 మార్చి 2024 | 5



వర్మ ఇంటికి పవన్: వర్మను ఆలింగనం చేసుకుంటున్న పవన్

జన..పవన్..



నీరాజనం : ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్

పవన్ కోసం ఎదురుచూపులు

నేను మీ వాడిని : పవన్ అభివాదం

పిఠాపురాన తొలి రోజు ప్రచార సభకు హాజరైన జనప్రవాహం

అన్నా.. నీ కోసమే..



మీ భవిష్యత్‌కు నేనున్నా : వర్మ కుటుంబీకులతో జనసేన అధినేత పవన్

ఆశీర్వదించండి..పిఠాపురాన లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి

- నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే బాధ్యత నాది
- రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా చేస్తా
- ఇక్కడే స్థలం కొంటా.. ఇల్లు కట్టుకుంటా
- నన్ను ఓడించేందుకు వైసీపీకి ఎందుకంత కక్ష
- ఓట్లకు వచ్చే వైసీపీ నేతలను నిలదీయండి
- తొలిరోజు ప్రచార సభలో నిప్పులు చెరిగిన పవన్



పవన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉదయ్ శ్రీనివాస్, పంతం నానాజీ, కొత్తపల్లి సుబ్బారాయుడు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి), పిఠాపురం, గొల్లప్రోలు రూరల్, మార్చి 30 : 'పిఠాపురం నియోజకవర్గానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. దేశం గర్వించదగ్గ ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. ఒక పక్క పోర్టులు, సెజ్, సముద్రం, హైవే ఇన్ని ఉన్నా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అందుకే పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు తీసుకువస్తా. నాకు ఎందరో వైద్యులైన స్నేహితులు ఉన్నారు. వారితో ఇక్కడ ఆస్పత్రులు నెలకొల్పేలా చేస్తా. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చేలా చేస్తా. ఒకసారి ఈప్రాంతం నాది అనుకున్నానంటే దాని అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తా. పిఠాపురంలో ఉన్న ఆలయాలను అన్నింటినీ కలిపి టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తా. అందుకే నేను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని తెలిసి వైసీపీ నన్ను ఓడించడానికి ఎన్ని కుట్రలు పన్నాలో అన్నీ పన్నుతోంది. నాపై ఎందుకు ఇంత కక్ష. మీరంతా అండగా ఉన్నారనే నాపై ఇన్ని వ్యూహాలు అమలు చేస్తోంది. అందుకే చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. పిఠాపురం నుంచి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపండి. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించండి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి పవన్ పిఠాపురం నియోజకవర్గంలో శనివారం నుంచి పర్యటన ప్రారంభించారు. నాకు ఇష్టమైన దత్తాత్రేయుడి సాక్షిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను. ఎలా చేస్తాను అనే సందేహం మీలో చాలా మందికి ఉండొచ్చు. అనుభవజ్ఞుడైన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారం, ఇతర నేతలతో నియోజకవర్గాన్ని ముందుకు నడిపిస్తా. ఇక్కడున్న ఆలయాలను కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక పథకం కింద నిధులు తెస్తాను. ఉప్పాడ కోత నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాను. కానీ వైసీపీ వాళ్లు ఇవేవీ చేయలేదు. నేను పోటీ చేస్తున్నాను అనగానే నేతలందరూ ఊరురా తిరుగుతున్నారు. ఎందుకు ఇన్నాళ్లు ఈ ప్రాంతాన్ని వాళ్లు అభివృద్ధి చేయలేదు. వంగా గీత వస్తే ఇదే నిలదీయండి. సెజ్‌లో పరిశ్రమలు ఎందుకు లేవని అడగండి. అరబిందో చేపడుతున్న పైపులైన్ కాలుష్యం గురించి నిలదీయండి. జెట్టీలు ఎందుకు లేవో అడగండి. వైసీపీ అంతా బెదిరింపుల రాజ్యం. కాకినాడలో రెండు పోర్టులను అరబిందో ద్వారా అధికార పెద్దలు లాగేసుకున్నారు. కాకినాడ పోర్టులో కంటైనర్లలో డబ్బులను వైసీపీ నేతలు దాచారు. జిల్లాలో ఉన్న మాఫియా డాన్ చెరువుల్లో మట్టి, బొండు ఇసుక, పోర్టు భూములు ఇలా అన్నింటిని మింగేశాడు. అతడి పేరు పలకడం కూడా నాకు ఇష్టం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి సంగతి చూద్దాం. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడ అన్నివర్గాల సమస్యలు తీరుస్తా. చేనేత, మత్స్యకారుల సమస్యల దగ్గర నుంచి యువతకు స్కిల్ సెంటర్లు, మిర్చి రైతుల కష్టాలు, సంతకు మౌలిక వసతులు ఇలా అన్ని సమస్యలు పరిష్కరిస్తాను. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమాయకులైన ప్రజల భావోద్వేగాలతో ఇంతవరకు నేతలు ఆడుకున్నారు. కానీ నేను అలా కాదు. బాధ్యతతో వ్యవహరించి ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటాను. అందుకే నన్ను ఆశీర్వదించండి. అసెంబ్లీకి పంపండి.'అని పవన్ కోరారు. పవన్ ఉదయం నుంచి జ్వరంతో బాధపడు తున్నారు. ఆయన ఆదివారం పుర్హూతికా అమ్మవారిని దర్శించుకుని వారాహికి పూజలు చేస్తారు. పర్యటనలో కాకినాడ ఎంపీ కూటమిఅభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, బీజేపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా కృష్ణరాజు ఉమ్మడి శ్రేణులు పాల్గొన్నారు.



అడుగడుగునా నీరాజనం.. పోలీసుల వైఫల్యం

తొలిరోజు పవన్‌కు అడుగడుగునా నీరాజనం పలికారు.సరిగ్గా మధ్యాహ్నం 12.40 గంటలకు గొల్లప్రోలులో హెలీప్యాడ్ వద్ద దిగారు. అక్కడ టీడీపీ, జనసేన నేతలు పవన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పుర్హూతికా అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉండగా సమయాభావంవల్ల ఆలయం మూతపడింది. దీంతో దొంతమూరులో మాజీ ఎమ్మెల్యే వర్మ ఇంటికి వెళ్లి సుమారు గంట సేపు గడిపారు. అనంతరం పవన్ నేరుగా హోటల్‌లో బస ప్రాంతానికి చేరుకున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు జగ్గంపేట నుంచి వచ్చిన ఉద్యమనేత తుమ్మలపల్లి రమేష్ పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. అనంతరం పుర్హూ తికా అమ్మవారి ఆలయానికి వెళ్లి అక్కడే వారాహికి పూజలు చేద్దామని పవన్ భావించారు. తీరా వారాహికి ఎన్నికల ప్రచార రథం కింద అనుమతులు లేవని అధికారులు అభ్యంతరం చెప్పడంతో దర్శనం కూడా రద్దు చేసుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలుకు బయలుదేరారు. దారిపొడవునా వందలాది జనం పవన్ వెంట నడిచారు. హారతులు పట్టారు. రాత్రి 8 గంటలకు చేబ్రోలుకు చేరుకునేసరికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారాహికి అనుమతులు జారీ చేసింది. దీంతో అప్పటికప్పుడు వారాహి ఎక్కి ప్రజలకు అభివాదం చేసుకుంటూ 8.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే వేలాది మంది పవన్ రాక కోసం చూడడం, అదే సమయంలో వారాహి ముందుకు కదలడంతో ఒక్కసారి అనుకోకుండా తొక్కిసలాట చోటుచేసుకుని పలువురికి గాయాలయ్యాయి. ఆ తర్వాత పవన్ వారాహిపైకి ఎక్కి దాదాపు గంట సమయం ప్రసంగించడంతో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు. పవన్‌కల్యాణ్ సభ సమయంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఉదయం 150 మంది పోలీసులతో భద్రత ఉంటుందని తెలియజేసినా రాత్రికి 20మంది కూడా లేకపోవడం గమనార్హం. దీనివల్లే తొక్కిసలాట జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వర్మకు అండగా ఉంటా..

పిఠాపురంలో పవన్‌కల్యాణ్

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 30: పొత్తులో భాగంగా తన కోసం సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను భవిష్యత్తులో బలమైన స్థానంలో నిలుపుతామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన అనంతరం నియోజకవర్గానికి శనివారం తొలిసారి పవన్ వచ్చారు. హెలికాప్టర్ దిగి నేరుగా పిఠాపురం మండలం పి.దొంతమూరులోని వర్మ నివాసానికి చేరుకున్నారు. తప్పెటగుళ్లు బాణ సంచా కాల్పులు, డప్పుల వాయిద్యాలతో పవన్‌కు స్వాగతం పలికారు.వర్మను ఆలింగనం చేసుకుని సత్కరించారు. వర్మ సతీమణి లక్ష్మీదేవి పవన్‌కు హారతులు ఇచ్చారు. అనంతరం కుమారుడు గిరీష్, ఇతర కుటుంబీకులతో మాట్లాడారు. వర్మ తల్లి అలివేలు మంగ పద్మావతి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వర్మ, జోన్-2 ఇన్‌చార్జి, మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావుతో అరగంటకు పైగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు, పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై చర్చించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం సాధించబోతున్నదన్నారు. దానికి సంకేతమే పిఠాపురం నియోజకవర్గంలో లభిస్తున్న అపూర్వ స్పందన అన్నారు. తన విజయం కోసం నేనున్నానంటూ నిలబడిన వర్మకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్మకు అన్ని విధాలా అండగా ఉంటానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబం తరపున పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.తన కంటే పదిరెట్లు అధికంగా కష్టపడి పవన్ విజయం కోసం పనిచేస్తామని చెప్పారు. పిఠాపురంలో టీడీపీ, జనసేన జెండా ఎగరాలన్నారు.కార్యక్రమంలో కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మీ విజయం ఖాయం : పవన్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు



మా సమస్యలు వినన్నా : పవన్ కోసం వచ్చిన పట్టు పరిశ్రమ రైతులు

ముగిసిన టెన్త్ పరీక్షలు

- రేపటినుంచి మూల్యాంకనం ప్రారంభం
- పరిశీలించిన డీజీఈ, ఆర్జేడీ

కాకినాడ రూరల్, మార్చి 30: ఈనెల 18న ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు ఏసీఈ రాజశేఖర్ తెలిపారు. చివరి రోజు నిర్వహించిన ఒకేషనల్ విద్యకు సంబంధించిన పరీక్షలకు మొత్తం 1617 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పది మూల్యాంకనం ఏప్రిల్ 1నుంచి ప్రారంభమై 8న ముగుస్తుందని దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. కాకినాడ సాలిపేటలోని పీఎస్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా పేపర్ల మూల్యాంకన కేంద్రాన్ని ఏపీ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు(డీజీఈ) డి.దేవానందరెడ్డి, పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి పరిశీలించారు. అనంతరం అధికారులకు, సీఈ, ఏసీఈలకు పలు సూచనలు, సలహాలను తెలిపారు. పరీక్షా పేపర్ల మూల్యాంకనానికి 114మంది చీఫ్ ఎగ్జామినర్లు, 677మంది సహాయ ఎగ్జామినర్లు హాజరుకానున్నారని, 228మంది ప్రత్యేక సహాయకులు హాజరుకానున్నారని డీఈవో తెలిపారు. 1,87,225 స్క్రిప్టులను మూల్యాంకనం చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో డేనియల్ రాజు, డీసీఈబీ వెంకట్రావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఎన్జీవో అసోసియేషన్ నాయకుల వినతి

కాకినాడ సిటీ, మార్చి 30: ఉద్యోగుల సమస్యలపై ఏపీఎన్జీవో అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను విన్నవించారు. ఈ మేరకు జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.నివాస్‌ను శనివారం అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఇతర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, కేవీఎస్వీ ప్రసాద్, ట్రెజరీశాఖ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఎన్.వీరబాబు, బి.శ్రీనివాసరావు, కాకినాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తిరాజు, రామకృష్ణ ఉన్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పకుండా పాటించాలి

- లేదంటే కఠిన చర్యలుంటాయి: కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 30: ఎన్నికల సంఘం జారీ చేసే ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ జె.నివాస్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జిల్లా నోడల్ అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. ఆ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతిరోజూ భారత ఎన్నికల సంఘం అనేక సూచనలు, సంస్కరణలు జారీ చేస్తుందని వాటిని నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. ఎలాంటి సందేహాలున్నా కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగంలో సంప్రదించాలన్నారు. ఓటింగ్‌శాతం పెంచడానికి జిల్లాలో స్వీప్ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులైనా సీ విజిల్ యాప్ ద్వారా 24గంటల్లో పరిష్కరించాలన్నారు. ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు మూడు షిఫ్ట్‌లో నియమించాలని, ఒకవారం ఒక షిఫ్ట్‌లో పనిచేసినవారు రెండోవారం వేరొక షిఫ్ట్‌కి మార్చాలన్నారు. ప్రచార అనుమతికోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎన్నికల సక్రమ నిర్వహణకు అధికారులకు సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై కూడా సమగ్రంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, సీపీవో త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ రమణి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, జిల్లా ఆడిట్ అధికారి సురేష్ బాబు, డీటీసీ మోహన్, జిల్లా పౌరసంబంధాల అధికారి నాగార్జున, డీఎస్‌వో ఎంవీ ప్రసాద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.నివాస్

కౌంటింగ్ హాలులో అన్ని ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

జిల్లాలో ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాలు, స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ సెంటర్లలో అన్నిఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ హాలును శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేసే వీటికి సంబంధించిన వెహికల్ పార్కింగ్, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. కౌంటింగ్ చేసే సమయంలో అవాంతరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ రామ్ సుందర్ రెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ మోహన్‌ప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, కలెక్టరేట్ ఎన్నికల డీటీ జగన్నాథం పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా చూడాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 30: వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా చూడాలని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నూరుశాతం నింపాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌నుంచి ఆయన జిల్లాలో ఉన్న మండల, మున్సిపాలిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో వారంలో మూడుసార్లు నీటి పరీక్షలు నిర్వహించి యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేలా వైద్యఆరోగ్యశాఖ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో వడగాల్పులు, తాగునీరు, ఎన్నికల కోడ్, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి అంశాలపై వివిధ జిల్లాస్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో తిప్పేనాయక్, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, డీపీవో భారతి సౌజన్య, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ జె.నివాస్

వారాహి వాహనానికి ఎన్నికల సంఘం అనుమతి: ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం, మార్చి 30: జనసేన అధినేత పవనకల్యాణ్ ప్రచారానికి వినియోగించే వారాహి వాహనానికి రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో నుంచి అనుమతులు వచ్చాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. వారాహికి జిల్లా అధికార యంత్రాంగం అనుమతి నిరాకరించిందనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. వారాహి వాహనం రాష్ట్రవ్యాప్తంగా తిరగాల్సి ఉన్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాలని సూచించడం జరిగిందని తెలిపారు. జనసేన పార్టీ దరఖాస్తుపై సీఈవో అనుమతి ఇచ్చారని, చేబ్రోలు సభలో వారాహి వాహనాన్ని అనుమతించడం జరిగిందని చెప్పారు.

పవర్ కట్





ట్రాన్స్‌కో షాక్

పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

- మొండి బకాయిలపై చర్యలు ప్రారంభించిన ట్రాన్స్‌కో
- సుమారు రూ.350 కోట్ల బకాయిల వసూలుకు రంగంలోకి
- చెల్లింపునకు ఎటువంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం
- పైగా ఆ డబ్బులను సైతం ప్రభుత్వ పథకాలకు మళ్లింపు
- పంచాయతీల ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం
- అడిగి..అడిగి..విసిగిపోయిన ట్రాన్స్‌కో
- ఎట్టకేలకు చర్యలు ప్రారంభం
- అంధకారంలో పంచాయతీ కార్యాలయాలు
- విద్యుత్ సరఫరా లేక మంచినీటి కుళాయిలన్నీ బంద్

రాజమహేంద్రవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అటు ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఇటు పంచాయతీల అలసత్వంతో విసిగిపోయిన ట్రాన్స్‌కో 'పవర్' బెత్తం ఝళిపించింది. ప్రభుత్వ కార్యాలయాల బిల్లుల వసూలు కోసం దండం పట్టుకోక తప్పలేదు. విద్యుత్ షాక్‌తో గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో వీధిలైట్లు ఆరిపోయాయి. నీతులు చెప్పే పాలకుల తీరుతో గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ (విద్యుత్ పంపిణీ సంస్థ) సర్కిల్ పరిధిలోని తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలోని పలు మండలాల్లోని వీధులు అంధకారంలోకి వెళ్లక తప్పలేదు. పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు కోట్లాది రూపాయలు బకాయి పడడంతో విద్యుత్ పంపిణీ సంస్థ మనుగడ, గ్రామాల్లో వీధి లైట్లు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతోందని నాలుగు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి గమనార్హం.

పేరుకుపోయిన బకాయిలు

పంచాయతీలు గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీటి సరఫరాకు విద్యుత్‌ని వినియోగిస్తాయి. అయితే టీడీపీ ప్రభుత్వంలో ఆ బిల్లులను నేరుగా విద్యుత్ పంపిణీ సంస్థలకు నగదు జమ చేసేవారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వ్యవస్థల మాదిరిగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ కూడా అతలాకుతలమైంది. పంచాయతీలే ఆ విద్యుత్ బిల్లులను చెల్లించుకోవాలని స్పష్టం చేసింది. దీంతో గ్రామాల్లోని వీధిలైట్లు, మంచినీటి సరఫరా ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటును (అప్పుకాదు.. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు) కూడా దారి మళ్లించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల పేరుచెప్పి పంచేయడంతో కనీసం కరెంటు బిల్లులు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే కరెంటు సరఫరా నిలిపివేస్తే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో విద్యుత్ పంపిణీ సంస్థ ఈ నాలుగేళ్లుగా కష్టాన్ని భరిస్తోంది. ఆ మంచితనం ఖరీదు కోట్లాది రూపాయలకు పేరుకుపోవడంతో బెత్తం తీయక తప్పలేదు.

బకాయిలు సుమారు రూ.350 కోట్లు

జిల్లాలను విభజించినా విద్యుత్ సర్కిల్ మాత్రం ఇంకా విభజన కాలేదు. తూర్పు, కోనసీమ, కాకినాడ జిల్లాలు, ఏజెన్సీలోని కొంత ప్రాంతం రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో ఉన్నాయి. వీటి సంబంధించి(ఉమ్మడి తూర్పు) 1029 పంచాయతీలు ఉన్నాయి. గత నెల 29 వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పంచాయతీలు రూ.9,14,48,198.. తూర్పు రూ.149,38,34,662.. కాకినాడ రూ.94,83,51,858.. కోనసీమ రూ.29,46,49,471.. మొత్తం కలిపి 282 కోట్ల 82 లక్షల 84 వేల 189 రూపాయల బిల్లులు పేరుకుపోయాయి. అయితే, ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు తెరవెనుక పనులు తెలియకూడదనే ఉద్దేశంతో కేవలం గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి అంటే 11 నెలల బిల్లులను మాత్రమే వసూలు చేసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రభుత్వం హుకుం జారీ చేసినా పంచాయతీల్లో నిధుల్లేక ఫలితం లేకపోయింది. ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న పంచాయతీలు కూడా పైసలు విదల్చలేదు. ఇక, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఉమ్మడి తూర్పులో రూ.74 కోట్ల 42 లక్షల రూపాయలు కరెంటు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్న పంచాయతీలు సైతం బిల్లులు చెల్లించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాగా.. కరెంటు సరఫరా నిలిపివేయడంపై తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి రాంబాబును వివరణ కోరగా.. తన దృష్టికి అలాంటి సమస్య రాలేదని కానీ, రెండు రోజుల్లో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామనడం గమనార్హం.

ఎందుకు ఊరుకున్నారు..

కరెంటు బిల్లు రూ.150 చెల్లించకపోతే ఠంచనుగా ఫీజు పీకేస్తారు. మరి కోట్లాది రూపాయల బకాయిలు ఉండగా ఎందుకు ఊరుకున్నారనే సందేహం సామాన్యుడి బుర్రను తొలిచేయవచ్చు. దానికి ఏకైక కారణం వైసీపీ పాలకులు అని చెప్పక తప్పదు. గ్రామాలకు విద్యుత్ నిలిచిపోతే పాలకుల చేతగానితనం బయట పడుతుందనే ఉద్దేశంతో కింది స్థాయిలోని ఏఈ నుంచి ఉన్నత స్థాయిలోని సీఎండీ వరకూ బెదిరింపులతో కాలం నెట్టుకొచ్చారు. ఇప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో తాము నలిగిపోతున్న విషయంపై ప్రజలకు నిజం తెలియజేయాలని విద్యుత్ పంపిణీ సంస్థ పూనుకొంది. దీంతో గ్రామాల్లో లైట్లు ఆరిపోయాయి. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం, మలికిపురం, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లోని పంచాయతీల ఫీజు పీకేశారు.

జీతానికి, బిల్లుకు లంకె..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం వ్యవహరించడంతో విద్యుత్ పంపిణీ సంస్థ ఇబ్బందుల్లో పడింది. విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి విద్యుత్‌ని కొనుగోలు చేసి ప్రజలకు విద్యుత్ పింపిణీ సంస్థలు సరఫరా చేస్తాయి. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అడ్వాన్సుగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ హామీ మేరకు ప్రజలకు విద్యుత్ పంపిణీ సంస్థలు సరఫరా చేస్తాయి. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు పేరుకుపోవడంతో విద్యుత్ పంపిణీ సంస్థ క్రమంగా నష్టాల్లోకి జారుకొంది. గత ప్రభుత్వంలో ఒకటో తారీఖున జీతాలు ఇచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక జీతాలు ఒకటో తారీఖున కాకుండా 20వ తారీఖు వరకూ ఖాతాకు జమవుతున్నాయి. ఈ జాప్యంపై ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే బకాయిలను వసూలు చేసుకొని జీతాలు తీసుకోవాలని మౌఖికంగా హుకుం కూడా జారీ చేయడంతో.. అటు ప్రభుత్వ బకాయిలను గట్టిగా అడగలేక ఇటు బిల్లులు వసూలు కాక మానసికంగా ఉద్యోగులు తీవ్ర ఆవేదన అనుభవిస్తున్నారు.

నో పవర్

ప్రభుత్వ నిర్లక్ష్యానికి దక్కిన ఫలితం

ఆత్రేయపురం, మార్చి 30: గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో 'పవర్' షాక్ ఇచ్చింది. శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో సర్వీసులు తొలగించడంతో గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ట్రాన్స్‌కో వైఖరిపై సర్పంచ్‌లు మండిపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి 30 శాతం నిధులు ఈసీఐఎల్, నెడ్‌క్యాప్, పీడబ్ల్యుఎస్ పేరుతో చార్జీలు వసూళ్ల చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో సర్పంచ్‌లు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలకు గత ఆగస్టు నెలలో రూ.700కోట్లు, ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.700 కోట్లు 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జమయ్యాయి. గత ఏడాది కాలం నుంచి పంచాయతీలకు ఎటువంటి ఆదాయం లేకపోవడంతో ఖర్చుపెట్టిన బిల్లులు చెల్లించేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల నిధుల నుంచి వీధి లైట్ల నిర్వహణ చార్జీల పేరుతో 10 శాతం, గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ, నెడ్‌క్యాప్ బిల్లుల పేరుతో 10 శాతం, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణకు టైడ్ గ్రాంటు నుంచి 10 శాతం నిధులు బలవంతంగా వసూలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో పంచాయతీకి సంబంధించి సర్వీసులను తొలగించడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.1400 కోట్లు జమకాగా, ఆ నిధుల్లో నుంచి సుమారు రూ.350 కోట్లు పంచాయతీల నుంచి ముక్కుపిండి వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. రేపు సోమవారంలోపు బిల్లులు చెల్లించాలని హుకుం జారీచేశారు. పలు పంచాయతీలు బిల్లులు చెల్లించేందుకు సమాయత్తం అవుతుండగా ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఆకస్మికంగా కరెంట్ సర్వీసులు తొలగించి సర్పంచ్‌లకు కనీస మర్యాద ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన నావికాదళ విన్యాసాలు



విన్యాసాలను ప్రదర్శిస్తున్న దృశ్యాలు



సర్పవరం జంక్షన్, మార్చి 30 : కాకినాడ సముద్ర తీరంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24 సీ ఫేజ్ విన్యాసాలు శనివారంతో ముగిశాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత్-అమెరికా యాంపిబీఎస్ విన్యాసాల్లో భాగంగా ఇరు దేశాలకు చెందిన సుమారు 1100 మంది త్రివిధ దళాల సైనికులు, అధికారులు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన సైనిక విన్యాసాలు దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా జరిగాయి. నింగి, నేల, సముద్ర ప్రాదేశిక జలాల్లో మోహరించిన ఇరు దేశాల యుద్ధ నౌకలు ఒకవైపు, శత్రువుల శిబిరాలను గుర్తించి యుద్ధ హెలికాప్టర్ల ద్వారా బాంబుల మోత మరోవైపు, సముద్ర తీరంలో భూమిపై నుంచి అత్యాధునిక సైనిక ఆయుధాలు చేతబట్టిన ఆర్మీ సిబ్బంది మరోవైపు శత్రుసేనలపై విరుచుకుపడి యుద్ధ క్షేత్రాన్ని తలపించేలా త్రివిధ దళాల సైనికులు నిర్వహించిన సైనిక కసరత్తు ఆద్యంతం తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. తుపాన్లు, విపత్తుల సమయంలో సాయం, వైద్యం అందించడం, శత్రు దేశాలు భూ ఆక్రమణకు దిగడం, యుద్ధ సమయంలో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇరుదేశాల త్రివిధ దళాలు కదనం రంగంలోకి దిగి భూమి, సముద్రం, ఆకాశయానం ద్వారా త్రివిధ దళాలు యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించాయి. ఈ దాడుల్లో యుద్ధ ట్యాంకులు, యుద్ధ నౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విన్యాసాలు, ప్రత్యేక వెసల్స్ మెకనైజ్డ్ లాంగ్ క్రాఫ్టులు, ఐఎన్ఎస్ ఐరావత్, జలస్వ, కేసరి వంటి యుద్ధ నౌకలు పాల్గొని సామర్థ్యాలను ప్రదర్శించాయి. వీటితో పాటు అమెరికాకు చెందిన ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎసల్, జర్మన్ యుద్ధ టౌన్ నౌక, ఎయిర్‌క్రాఫ్టులు, చేతక్ హెలికాప్టర్లు తదితర యుద్ధ బృందాలు నాలుగు రోజుల పాటు సాగిన విన్యాసాల్లో పాల్గొని తమ సామర్థ్యాలను ప్రదర్శించారు. ఈ విన్యాసాలను నేవీ రియల్ అడ్మిరల్ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్ ధనకర్, ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్, అమెరికా నేవీ రియర్ అడ్మిరల్ వైస్ కమాండర్ జాక్విస్ మార్టినైజ్‌లు పాల్గొని, త్రివిధ దళాలు నిర్వహించిన విన్యాసాలను తిలకించి, పలు సూచనలు చేశారు. అలాగే యుద్ధం, ఆపద సమయంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు అందించే ఫస్ట్ ఎయిడ్, ఆపరేషన్, వైద్య సేవల శిబిరాలను సందర్శించారు. కాకినాడ బీచ్ నుంచి ఉప్పాడకు వెళ్లే వాహనాలను ఆదివారం నుంచి అనుమతించనున్నట్లు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు.

విధుల నుంచి వలంటీర్లు దూరం

- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం..
- సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు స్వాధీనం చేసుకోవాలని ఆదేశం
- సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయించే యోచన?

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి ఎన్నికల కమిషన్ తేరుకోలేని షాక్ ఇచ్చింది. పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను తప్పించింది. అంతే కాక వారి వద్ద ఉన్న ప్రభుత్వం సెల్‌ఫోన్లను కూడా వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని వైసీపీ నేతల్లో కలకలం మొదలైంది. వలంటీర్ల చేత పింఛన్లు పంపిణీ చేయించి.. అదే సమయంలో ఓటు వైసీపీకి వేయవలసిన అవసరం గురించి చెప్పించడానికి వైసీపీ పెద్ద కుట్ర చేసిన సంగతి తెలిసిందే. వలంటీర్ల చేత చెప్పిస్తే కొందరైనా వింటారనే ఆలోచనతో వైసీపీ నేతలు వ్యూహం పన్నారు. మొదట్లో రాజకీయ పార్టీల సమావేశాలకు వెళ్లవద్దని ఆదేశించినా నేతల ఒత్తిళ్ల వల్ల కొందరు వెళ్లి ఆ కాస్త ఉద్యోగం పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ విధంగా రాజమహేంద్రవరంలో 24 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి వారితో పనిచేయించుకునే ఆలోచన కూడా వైసీపీ నేతలు కొందరు చేశారు. దీంతో 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అంతేకాక ఎన్నికల ముందు ఏప్రిల్ 1, మే 1వ తేదీల్లో కూడా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున వారికి వలంటీర్ల చేత పింఛన్లు ఇప్పించి, ఓటు వైసీపీకి వేయాలని చెప్పించే ప్రయత్నంలో ఉన్నారు. ఇది పసిగట్టిన ఎన్నికల కమిషనర్ జోక్యం చేసుకుని, పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పాత్ర ఉండకూడదని, వారినుంచి ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు కూడా స్వాధీనం చేసుకోవాలని, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. వలంటీర్ల ఫోన్లలో తన పరిధిలోని ఓటర్ల పూర్తి వివరాలు ఉంటాయి. వారితో వాట్సాప్ గ్రూపు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి సమాచారం వాట్సాప్ ద్వారా అందిస్తున్నారు. ఇక వాట్సాప్, ఫోన్, మెసేజ్ ద్వారా కూడా ఓటర్లను ప్రభావితంగా చేయకుండా ఉండే విధంగా వారి ఫోన్లను స్వాధీనం చేసుకోమని ఆదేశించింది. దీంతో వైసీపీ కంగారు పడుతోంది. జిల్లాలో సుమారు రెండు లక్షల 45 వేలు పింఛన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 9146 మంది వలంటీర్లు వీటిని పంపిణీ చేసేవారు. ఇటీవల వారీ సంఖ్య బాగా తగ్గింది. ఇవాళ వీరిని ఆపేయడంతో పాటు వాటన్నింటిని ఒకటి నుంచి పంపిణీ చేయడానికి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులతో ఈ పంపిణీ చేయించే ఆలోచన చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఏ గైడ్‌లైన్స్ వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

మావోయిస్టుల కరపత్రాలు



ఎటపాక, మార్చి 30: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో రెండు చోట్ల శనివారం వెలసిన (భారత కమ్యూనిస్టు పార్టీ) మావోయిస్టు కరపత్రాలు కలకలం రేపాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు రాష్ట్రాల సరిహద్దులో కరపత్రాలు దర్శనం ఇవ్వడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎటపాక మండలం, సరిహద్దు గ్రామాలైన కన్నాయిగూడెం గ్రామ శివారు ప్రాంతంతో పాటు చెన్నంపేట- సీతంపేట గ్రామాల మధ్యలో అల్లూరి డివిజన్ కమిటీ, చర్ల-శబరి ఏరియా కమిటీ పేరుతో మావోల పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లను చెట్లకు, నేలపై వదిలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీని, దాంతో అంటకాగుతున్న పార్టీలన్నింటినీ తన్ని తరమాలని పేర్కొన్నారు. బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడమంటూ పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలపై జరుగుతున్న ఘోరాలు దేశంలో అన్ని ప్రాంతాల్లో జరుగుతాయని, మతోన్మాద శక్తులనే ఓడించాలన్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో మావోల పోస్టర్లు దర్శనం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

నిపుణులైన సర్జన్లుగా ఎదగాలి

రాజానగరం, మార్చి 30: జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలను వినియోగించుకుని మంచి దంత వైద్య సర్జన్లుగా ఎదగాలని న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) దంత వైద్య పరిశోధన విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్థోడాంటిస్ట్ డాక్టర్ రీతూ దుగ్గల్ అన్నారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాలలో విద్యనభ్యసించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా దంత వైద్య విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల మెంటార్ డాక్టర్ గన్ని సందీప్ మాట్లాడుతూ పెద్ద పట్టణాలు, నగరాలకు మాత్రమే పరిమితమైన దంతవైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రాంతంలో స్థాపించామన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ గంటా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆదాయం రూ.12 లక్షలు

ఐ.పోలవరం, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం శనివారం దేవదాయశాఖ సహాయ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. 70 రోజులకు ప్రధాన హుండీ ఆదాయం రూ.5,57,638లు, నిత్యకల్యాణ కట్న కానుకల హుండీ ఆదాయం రూ.4,95,233, అన్నదానం హుండీ ఆదాయం రూ.1,58,085 వెరసి మొత్తం ఆదాయం రూ.12,10,956 వచ్చింది. దీంతో పాటు ఒక విదేశీ డాలర్, ఒక టైటానిక్ వాచ్ వచ్చినట్టు తెలిపారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, మట్టపర్తి శివరాంబాబు, ఆలయ అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మార్చి 30: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,26,700 అన్నదాన విరాళాలు ద్వారా రూ. 41,444 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 8,240, తులాభారం రూ.400 వెరసి రూ.3,38,655 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

బాలబాలాజీకి రూ.2.13 లక్షల ఆదాయం

మామిడికుదురు, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారికి శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,13,043 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. స్వామివారిని 3,174 మంది దర్శించుకుని 2,358 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. నిత్యాన్నదాన పథకానికి ఆచంట మండలం కొడమంచిలికి చెందిన తాళ్లూరి రామచంద్రరావు-సూర్యచంద్రావతి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు

సీఎంఆర్ జ్యువెలరీ మాల్ ప్రారంభం



షోరూం ప్రారంభించిన అమృతతో మావూరి కుటుంబం

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 30: కాకినాడలో సీఎంఆర్ జ్యువెలరీ మాల్‌ను శనివారం సాయంత్రం హనుమాన్ చిత్రం హీరోయిన్ అమృత అయ్యర్ ప్రారంభించారు. స్థానిక దేవాలయంవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ మాల్‌ను ప్రారంభించి, నగలను ధరించి కనువిందు చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎంఆర్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా ఆభరణాలు రూపొందిస్తున్నామని అన్నారు. బంగారు ఆభరణాలపై తరుగు 3 శాతం, వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదన్నారు. సంస్థ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ ప్రస్తుత తరానికి తగ్గట్టుగా సరికొత్త డిజైన్‌లతో ఆభరణాలు తయారు చేయిస్తున్నామన్నారు. మాల్ ప్రారంభం సందర్భంగా గ్రాముకు రూ.250 తగ్గింపు ఇస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సీఈవో వైఎల్ చౌదరి, ద్వారంపూడి వీరభద్రారెడ్డి, రాపాక వెంకట్ ఆనంద్, పి.మంగరాజు, బాదం సుందరరావు, పెద్ది రత్నాజీ, గొడవర్తి లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి30: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని ప్రాకార మండపంలో క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.49.84 లక్షలు లభించినట్లు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

శనీశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, మార్చి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి శనీశ్వర(మందేశ్వర) ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సర్వదర్శనాలకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,15,059 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

'రివర్‌బే'లో విజిలెన్స్ తనిఖీలు

అన్నీ ఉల్లంఘనలే.. కేసులు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లలో వంట గదులు పరిశుభ్రంగా ఉండాల్సిందేనని.. వినియోగదారులకు నాణ్యమైన, తాజాగా, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. నగరంలోని రివర్‌బే హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి ఎస్పీ సోదాలు చేశారు. పలు ఉల్లంఘనలను గుర్తించి కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్పీ వివరాల ప్రకారం.. హోటల్‌లో వాడుతున్న నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) మీటర్ రీడింగ్ చూడగా 25% కంటే ఎక్కువగా ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశారన్నారు. అలాగే మునిసిపాలిటీకి ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించడం లేదన్నారు. ఆ బకాయిలు రూ.13,77,220 ఉండడం గుర్తించామన్నారు. తూనికల యంత్రానికి నిబంధనల ప్రకారం అనుమతుల లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. వ్యాపారానికి సంబంధించి జీఎస్టీ రిటర్నులు గత ఏడాది సెప్టెంబరు నుంచీ ఫైల్ చేయలేదన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'కూటమిని గెలిపించుకోవాలి'

కిర్లంపూడి, మార్చి 30: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకోవాలని జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత అన్నారు. శనివారం చిల్లంగి గ్రామంలో కాళ్ల, దొంగబాబు కుమారుడు కాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, తోట సర్వారాయుడు, చదరం చంటిబాబు, కుర్ల చినబాబు పాల్గొన్నారు.

పలుచోట్ల 'రన్ ఫర్ జీసస్'


కాకినాడలో ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం


పెద్దాపురం: రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 30: ఏసుక్రీస్తు మరణం గెలిచి తిరిగి లేచి పునరుద్ధానుడు అని ఏపీసీసీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రిక్కి గూటం అన్నారు. ఏసుక్రీస్తు పునరుద్ధారణను పురస్కరించుకుని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కాకినాడలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. రిక్కి గూటం, పాస్టర్ ఫెలోషిప్ జోషప్ బెన్ని, జ్యోతికుమార్, రెడ్డి దేవిశెట్టి చార్లెస్, బలగం శ్యాంకుమార్, విలియమ్స్ స్టీఫెన్ ఆనంద్, అంకిత్‌రెడ్డి జెండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. భానుగుడి నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, కల్పనా సెంటర్, ఆనందభారతి వరకు నిర్వహించారు

పిఠాపురం: పట్టణంలో శనివారం సాయంత్రం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి ప్రధాన వీధుల మీదుగా పాస్టర్లు, క్రైస్తవులు ర్యాలీ జరిపారు. పాస్టర్లు సమర్పణ, యాకోబురాజు, జోసెఫ్‌రాజు, ఎండీ రాజు, ప్రేమానందం, తరుణ్ తదితరులున్నారు.

పెద్దాపురం: పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. క్రైస్తవ విశ్వాసులు సుమారు 200 మంది పాల్గొని సువార్తను ప్రకటించారు. ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిలిప్‌రాజు, వెంకట్‌పాల్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్

జగ్గంపేట: జగ్గంపేటలో ఈస్టర్ సందర్భంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాన్‌వెస్లీ స్వగృహం నుంచి ర్యాలీ ప్రారంభమై పురవీధులమీదుగా గోకవరం రోడ్డుకు చేరుకున్నారు. పాస్టర్లు సుదర్శన్, విజయరాజు, సువార్తపాల్ ఉన్నారు.

ఏలేశ్వరం: ఈస్టర్ పండుగ సందర్భంగా ఏలేశ్వరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిషప్ ఆంధ్రూస్ ఆధ్వర్యంలో దైవసేవకులు వందలాది మంది ర్యాలీ చేశారు. మదర్ తెరిస్సా యూత్, ఐక్యత యూత్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీబీఎం ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి ప్రారంభించిన ర్యాలీని దవులూరి దొరబాబు జెండా ఊపి ప్రారంభించారు. మడికి మేరీ సోనియా, మోజెస్, కళ్యాణ్, పిట్లా సత్యనారాయణ, పాలిక కుసుమ, మండల పాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఎం.సాల్మన్‌రాజు, వీ.జాన్, ఆర్.లాజరస్, చంటి ఉన్నారు.

'సాధనతో కృషి చేస్తే ఉత్తమ ర్యాంకులు'

జేఎన్టీయూకే, మార్చి 30: పోటీ పరీక్షలకు సాధనతో కృషి చేస్తే ఉత్తమ ర్యాంకులు సాధించడంతో పాటూ అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించగలరని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని వీసీ సమావేశ హాల్లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2024 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శనివారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ సుమలత, వైస్ ప్రిన్సిపాల్స్ రత్నకుమారి, మీరాసాహెబ్ పాల్గొనగా యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. గేట్‌లో జాతీయస్థాయిలో 10వ ర్యాంకు సాధించిన విద్యార్థిని వై.లక్ష్మీసాయికృష్ణను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి 30 మంది, ఈఈఈ నుంచి 34మంది, మెకానికల్ నుంచి 21మంది, ఈసీఈ విభాగం నుంచి ర్యాంకులు సాధించిన 65మంది, సీఎస్ఈ నుంచి ర్యాంకులు సాధించిన 25మంది, కెమికల్ విభాగం నుంచి 8మంది, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగంనుంచి ఆరుగురు మొత్తం 189 మందికిపైగా ఉత్తమ ర్యాంకులు సాధించగా అభినందించారు. పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

'ఎన్నికలను పూర్తి చేసేందుకు సహకరించాలి'

ఏలేశ్వరం, మార్చి 30: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి అన్నారు. శనివారం ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చిన తరువాత వివాదాల్లో తలదూరిస్తే కేసులు తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని, ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా గుర్తిస్తామన్నారు. ఒకసారి కేసు నమోదు ఐతే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ మాట్లాడుతూ నిర్భయంగా ఓటు వేందుకు అణువైన పరిస్థితులు కల్పిస్తామన్నారు. పోలీసువారికి ప్రతీఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గండేపల్లి, మార్చి 30: పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణా తరగతులను ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభిస్తున్నామని ఆదిత్య విద్యాసంస్థల వైస్‌చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 1000 మంది విద్యార్థులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆదిత్య పాలిటెక్నిక్ వెబ్‌సైట్ **www.polytechnic.aec.edu.in**లో లాగిన్ అయ్యి పేరును రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, రాజమండ్రి, మామిడాడలో ఉన్న ఆదిత్య కళాశాలలు, పాఠశాలల్లో పాలీ సెట్ ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఇతర వివరాలకు 84980 53404, 9505518249, 9000604053, 9177648086 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రెడ్డి సుబ్రహ్మణ్యానికి టీడీపీ నేతల అభినందన

తాళ్లరేవు, మార్చి 30: శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా పనిచేసిన రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఇటీవల నియమించడంతో తాళ్లరేవు టీడీపీ నేతలు శనివారం కొత్తపేట ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో అభినందించారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, అమలాపురం పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, అమలాపురం పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి టేకుమూడి లక్ష్మణరావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి మందాల గంగసూర్యనారాయణ ఆయనతో చర్చించారు.

'హెచ్‌ఐవీని అదుపు చేయడం కష్టం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 30: మానవ మనుగడలో సహజ విషయమైన లైంగికత ద్వారా వ్యాపించే హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాప్తిని అదుపు చేయడం కష్టసాధ్యమని రంగరాయ మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ విభాగ అధిపతి డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం తన సహాధ్యాయి డాక్టర్ యనమదల మురళీకృష్ణ రాసిన హెచ్‌ఐవీ-ఎయిడ్స్ పుస్తకాన్ని కచేరిపేటలోని లక్ష్మీవైద్యశాలలో ఆవిష్కరించారు. ఎయిడ్స్ రోగులకు మేలు చేసే అంశాలన్నీ పుస్తకంలో పొందుపరిచినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన రాజారపు మహేష్

సర్పవరం జంక్షన్, మార్చి 30: కాకినాడ 47వ డివిజన్‌కు చెందిన రాజారపు గోపాలరావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రాజారపు మహేష్ శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో ఆ పార్టీలో చేరారు. కరణంగారి సెంటర్ నుంచి 100 మంది అనుచరులతో విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి పళ్లంరాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజుల ఆధ్వర్యంలో పార్టీలో చేరి బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ప్రత్తిపాడులో కాంగ్రెస్ ఆందోళన

ప్రత్తిపాడు, మార్చి 30: కాంగ్రెస్‌పై ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం ప్రత్తిపాడులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత నీరుకొండ సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. విపక్ష పార్టీలపై బీజేపీ కక్ష సాధింపు ధోరణితో వ్యవస్థలను వాడుకుంటుందని విమర్శించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పల కోటేశ్వరరావు, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి కొల్లు వీరగణేష్, ఎస్.కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న ఎండలు


ప్రత్తిపాడులో రహదారిపై ఎండ తీవ్రత

ప్రత్తిపాడు, మార్చి 30: ఎండలు మండిపోతూ రారెత్తిస్తుండటంతో మెట్ట ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. శనివారం భానుడు ప్రతాపం, వడగాల్పులకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి ప్రారంభంలోనే పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు తల్లడిల్లుతున్నారు. ప్రత్తిపాడు ప్రాంతంలో ఎండల తీవ్రతకు ప్రజలకు ఇళ్లకే పరిమితమవడంతో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలకు మక్కువ చూపడంతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

కరప: మండల వ్యాప్తంగా శనివారం ఎండలు దంచికొట్టాయి. ఉదయం 11గంటల నుంచి భానుడి ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎండ ఉక్కబోత భరించలేక ఆపసోపాలు పడ్డారు. మధ్యాహ్నం ఇళ్లకే పరిమితమయ్యారు.

గొల్లప్రోలులో పవన్‌కు ఘన స్వాగతం

హెలిప్యాడ్ వద్దకు తరలివచ్చిన టీడీపీ, జనసేన నేతలు, ప్రజలు


గొల్లప్రోలు నుంచి పి.దొంతమూరు వెళ్తూ స్వాగతం పలుకుతున్న ప్రజలకు అభివాదం తెలుపుతున్న పవన్


గొల్లప్రోలులో పవన్‌కు స్వాగతం పలుకుతున్న గిరీష్‌వర్మ, టీడీపీ నాయకులు

గొల్లప్రోలు, మార్చి 30: పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గొల్లప్రోలు పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు శనివారం మధ్యాహ్నం చేరుకున్నారు. అక్కడ ఆయనకు జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీ, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నాయకులు తోట సుధీర్, మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మల రామస్వామి, దాసరి కిరణ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ ఎస్ఎన్ వర్మ తనయుడు గిరీష్‌వర్మ, టీడీపీ పిఠాపురం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, రావు అక్షయ్ తదితరులు స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్దకు వచ్చిన బ్రాహ్మణులు పవన్‌కల్యాణ్‌ను కలుసుకుని ఆశీర్వచనాలు అందించడంతో పాటు సత్కరించారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికారు.

అభివాదం చేసుకుంటూ...

గొల్లప్రోలు నుంచి మాజీ ఎమ్మెల్యే వర్మ ఇంటికి వెళ్లే మార్గంలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ పవన్‌కల్యాణ్ ముందుకు సాగారు. హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులకు పవన్ అభివాదం చేశారు. అనంతరం బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం గ్రామాల మీదుగా పి.దొంతమూరు చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు పవన్‌కు స్వాగతం పలికారు. కారు ఓపెన్ టాప్ నుంచి పవన్ వారికి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

జనసేనలో తుమ్మలపల్లి రమేష్ చేరిక



పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 30: జగ్గంపేట నియోజకవర్గం నుంచి కిర్లంపూడి ప్రాంతానికి చెందిన తుమ్మలపల్లి రమేష్ జనసేన అధినేత పవన్ సమక్షంలో శనివారం జనసేనలో చేరారు. పిఠాపురం పర్యటనకు విచ్చేసిన పవన్‌ను ఆయన కలిశారు. రమేష్‌కు పవన్ జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ ప్రభుత్వం చేసిందేమిలేదు

ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు


తాళ్లరేవులో మాట్లాడుతున్న బుచ్చిబాబు

తాళ్లరేవు, మార్చి 30: ఓఎన్‌జీసీ కంపెనీ సీఎస్ఆర్ నిధులు తప్ప వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీలేదని ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. శనివారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేటనష్టపరిహారం అందించే విషయంలో మత్స్యకారులను స్థానిక ఎమ్మెల్యే మోసం చేస్తున్నారని ఆరోపించారు. మత్స్యకారులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఎప్పుడో జిల్లాకలెక్టరు ఖాతాకు జమచేశారని, మత్స్యకారుల ఓట్లు కోసం వాటిని విడతల వారిగా పరిహారం అందించి మత్స్యకారులతో ఆడుకుంటున్నారని దీని వల్ల మత్స్యకారులంతా రూ.10కోట్లు వడ్డీ నష్టపోయారని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మత్స్యకారులకు చమురు సంస్థల ద్వారా వచ్చేరాయితీను రాబట్టేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం గాడిమొగ పంచాయతీ పెదలవలసల గ్రామం పోతాబత్తుల కృష్ణ, పోతాబత్తుల బ్రహ్మం ఆధ్వర్యంలో 100మత్స్యకార కుటుంబాల యువకులు, మహిళలు టీడీపీలో చేరారు. మత్స్యకార నేతలు లంకే నూకరాజు, పోతాబత్తుల కృష్ణ, బ్రహ్మం, మాజీ జడ్పీటీసీలు పెనింగి ఈశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, వాడ్రేవు వీరబాబు,మల్లాడి ధర్మారావు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప


సామర్లకోటలో ప్రచారం చేస్తున్న చినరాజప్ప

సామర్లకోట, మార్చి 30: పెద్దాపురం నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, తనకు ఎమ్మెల్యేగా మూడోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై శనివారం రాత్రి సామర్లకోట పట్టణ పరిధిలో 22, 23 వార్డుల్లో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రాజప్ప టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన నాయకులతో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థి తనను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో కరపత్రాలను మహిళలకు రాజప్ప అందజేశారు.

'కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి'


వేళంగిలో ప్రచారం చేస్తున్న నానాజీ

వేళంగి (కరప), మార్చి 30: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ స్పష్టంచేశారు. వేళంగిలో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, మండలాధ్యక్షుడు బండారు మురళి, ఆయా పార్టీల నాయకులు చుండ్రు వెంకన్నరాయచౌదరి, బోగిరెడ్డి కొండబాబు, శాకా శ్రీనివాస్, పాతూరి భాస్కరరామన్న, యర్రమాటి రామలింగేశ్వరరావు, వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి పట్టాభి, కాకరపల్లి వెంకట్రావు, వాసంశెట్టి సత్యనారాయణ, వీరంరెడ్డి ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలతో వెలుగులు'

తొండంగి, మార్చి 31: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు నిండుతాయని తుని ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య పేర్కొన్నారు. శనివారం తొండంగిలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె ప్రచారం చేపట్టారు. టీడీపీ నేతలు యనమల నాగేశ్వర్రావు, యనమల రాజేష్, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, బంటుపల్లి అన్వేష్, నేమాల కృష్ణ, పక్కుర్తి వంశీ, జనసేన నేత బెండపూడి నాయుడు, బీజేపీ నేత వెలుగుల గోపాలకృష్ణ, కొయ్యా రామకేశవ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో దివ్య



వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



గండేపల్లి: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నెహ్రూ, కాకినాడలో టీడీపీలో చేరినవారితో కొండబాబు

గండేపల్లి, మార్చి 30: మండలంలో రామయ్యపాలెం మాజీ సర్పంచ్ కోన పైడయ్య, మైలివరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామయ్యపాలెం గ్రామ ఉపసర్పంచ్ ఇల్లపు అప్పయ్యమ్మ, కన్నయ్య , వార్డు మెంబర్లు గొల్లవిల్లి చిన్నారావు, గొల్లవిల్లి శ్రీను, మైలవరపు విష్ణు, మరిసే నూకరాజు తదితర వార్డు మెంబర్లతో పాటు 50 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి జగ్గంపేట టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, కందుల చిట్టిబాబు, సుంకవిల్లి రాజు, కంటిపూడి రామారావు, దాపర్తి సీతారామయ్య, యర్రంశెట్టి బాబ్జి, కేతిన బాబి, కంటిపూడి సత్తిబాబు, వెలమాటి కాశీ, చిటికెల కన్నబాబు, పాలచర్ల సత్యనారాయణ ఉన్నారు. నెహ్రూ రామయ్యపాలెం, ఉప్పలపాడులో చైతన్య రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాకినాడ సిటీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా పదో డివిజన్ దుమ్ములపేటలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సమావేశానికి భారీగా మత్స్యకారులు తరలివచ్చారు. కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండబాబు సమక్షంలో పెద్దఎత్తున మత్స్యకార యువకులు, మహిళలు టీడీపీలో చేరారు. దుమ్ములపేటకి చెందిన జాంతాడు యూత్ ఆధ్వర్యంలో 150 కుటుంబాలు పార్టీలో చేరారు. దుమ్ములపేట జాంతాడు యూత్ సభ్యులు పెమ్మాడి బుజ్జి, మైలపల్లి మ సేను, పెమ్మాడి చంద్రరావు, గద్దేపల్లి సత్తిబాబు, మైలు పోమేలు, ముమ్మిడి దానయ్య, టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, ఎరిపల్లి రాము, చోడిపిల్లి సతీష్, మూగు రాజు, మోసా దానమ్మ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ చలమయ్య పాండ్రంకి అప్పారావు, అలమండ వీర్రాఘవులు తదితరులు శనివారం హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నివాసంలో టీడీపీ చేరారు. టీడీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో లోకేశ్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డి.మీసాలరాజు, బదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోనాల వెంకటరమణ, నాగబాబు, పెండ్ర శ్రీను, రుచి రమేష్ పాల్గొన్నారు.

తుని రూరల్: తేటగుంటలో తుని కూటమి తుని అభ్యర్థి యనమల దివ్య స్వగృహంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం తునికి చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. చేరిన వారిలో తోటాడ శ్రీను, తోటాడ కుమారి, రామకృష్ణ, లంకా రమేష్, లంకా రత్నం పలు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు యనమల రాజేష్, తుని పట్టణ టీడీపీ అధ్యక్షులు ఇనుగంటి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ అల్లురాజు, మళ్ల గణేష్ ఉన్నారు.


ఏలేశ్వరం: టీడీపీలో చేరికవారితో నారా లోకేశ్

ఉద్యోగులను ఎలా నియమిస్తారు?

వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం
తక్షణం రద్దు చేయాలని డిమాండ్


సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం, మార్చి 30: కౌన్సిలర్లకు ఎటువంటి సమాచారం లేకుండా ఏకపక్షంగా ఏపీ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఏడుగురిని ఉద్యోగాల్లో నియమించడంపై వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం నియమాకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి హాజరుకాకపోవడంతో వైస్‌చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే వైసీపీ కౌన్సిలర్లు సోమరౌతు లలిత, బొజ్జా జగదీశ్వరీ, బోను దేవ, పెదపాటి నాగేశ్వరరావు, చెల్లూరి లోవరాజులతో పాటు 24మంది వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు ఆప్కోస్ ద్వారా ఏడు ఉద్యోగాల భర్తీ అంశాన్ని ప్రశ్నించారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారని నిలదీశారు. వీటిపై కనీసం తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంపై బయట పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీంతో నింద తమపై పడుతున్నదని తెలిపారు. ఉద్యోగాల నియమాకాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనరు కనకారావు మాట్లాడుతూ గత కమిషనరు ఉన్నప్పుడు ఈ వ్యవహారం జరిగిందన్నారు. గతేడాది డిసెంబరు 23వన ఫైల్ వెళ్లిందని, అప్కోస్ నుంచి అనుమతులు రావడంతో తాను ఉత్తర్వులు ఇచ్చానని తెలిపారు. కౌన్సిలర్లు లిఖితపూర్వకంగా తమ అభ్యంతరాలను తెలిపితే వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

కుళాయి కనెక్షన్ల తొలగింపుపై ఆగ్రహం

తాగునీరు ఇవ్వకుండా పన్నులు చెల్లించలేదని కుళాయి కనెక్షన్లు తొలగించడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని మండిపడ్డారు. వెలంపేట, డ్రైవర్స్ కాలనీ, కత్తులగూడెం ప్రాంతాల్లో తీవ్ర మంచినీటి సమస్య ఉందని తెలిపారు. డ్రైవర్స్‌కాలనీలో కుళాయిల ద్వారా ఉప్పు నీరు సరఫరా అవుతున్నదని, దీని వల్ల ప్రజలు అనారోగ్యాలు బారిన పడే ప్రమాదముందని కౌన్సిలరు బోనాసుల శివ తెలిపారు. వెలంపేటలో మూడేళ్లుగా కుళాయిల ద్వారా నీరు రావడంలేదని, నీరు ఇవ్వ కుండా కుళాయి పన్ను వేయడం ఏమిటన్ని కోళ్ల బంగారుబాబు ప్రశ్నించారు. విద్యుత్ దీపాలు వెలగడం లేదని, పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని అయితే రాంబాబు తెలిపారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి టోల్‌ఫ్రీ

కాకినాడ కమిషనర్ వెంకటరావు


మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 30: ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా మంచినీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. వేసవి నీటి ఎద్దడిపై కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ ప్రాంతంలోనైనా నీటి సమస్య ఎదురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4255990కు కాల్ చేయాలని, వెంటనే స్పందించి పరిష్కరించడంతోపాటు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. రూ.1.28కోట్లతో వేసవి కార్యాచరణను కూడా సిద్ధంచేశామని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లల వైద్యశిబిరం


పిఠాపురంలో నిర్వహించిన పరీక్షా శిబిరం

పిఠాపురం, మార్చి 30: పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు వీలుగా వైద్య నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో 1నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరీక్షలు చేశారు. జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి చామంతి నాగేశ్వరరావు, ఎంఈవోలు నారాయణదాసు, అచ్చిరాజు, హెచ్‌ఎం శ్యాంబాబు, వైద్యులు డాక్టర్ కె.సత్యసాగర్, డాక్టర్ మాధురి, ఉమామహేశ్వరీ, కృష్ణవాసన్ ఉన్నారు.

దుర్గాంబిక విగ్రహ ప్రతిష్ఠ

వేళంగి (కరప), మార్చి 30: స్థానిక కొత్తపేట వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. వేళంగి, కరప గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న, చనిపోయినవారి కుటుంబాలను పరామర్శించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సవిలే నీలిమారాజేష్, చింతా ఈశ్వరరావు తదితరులున్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఏలేశ్వరం, మార్చి 30: పట్టణంలో శ్రీసీతారాముల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. శనివారం దిబ్బలపాలెం రామాలయంలో శ్రీమాన్ చక్రవర్తుల వెంకట సత్య రాఘవాచార్యులు ఆధ్వర్యంలో శిడగం వెంకటేశ్వరరావు త్రివేణి దంపతుల చే పూర్ణాహుతి,మహాశాంతి హోమం, గోదర్శనం, క్షీరాధివాసము, కుంభపూజ నిర్వహించి శ్రీసీతారామ, లక్ష్మణుల, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శిడగం శివ, ప్రయాగ మూర్తి, శిడగం రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కిర్లంపూడి, మార్చి 30: అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేసి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కిర్లంపూడి తహశీల్దార్ బి.ఆశయ్య అన్నారు. మండలంలో వేలంక నుంచి చిల్లంగి వెళ్లే రహదారిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న 2 ట్రాక్టర్లు సీజ్ చేసి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లను ఆర్ఐ సత్యప్రసాద్, వేలంక వీఆర్వో ప్రసాద్,జగపతినగరం వీఆర్వో శ్రీలక్ష్మి సీజ్ చేశారని తెలిపారు.

జ్యోతుల నెహ్రూ పరామర్శ

జగ్గంపేట, మార్చి 30: గోకవరం మండలం కామరాజుపేట మాజీ సర్పంచ్ అడపా బంగారు బాబు తండ్రి సోమరాజు ఇటీవల మరణించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ బంగారు బాబును కామరాజు పేటలో పరామర్శించారు.